# లోకాభిరామాయణం

## శ్రీ మునిమాణిక్యం నరసింహారావు

ప్రత్యేకంగా ఏదో ఒక విషయాన్ని గురించి కాక అనేక సంగతులను గురించి మాట్లాడడాన్ని లోకాభిరామాయణం అంటారు. అసలు ఆ మాటకు, లోకమునకు మనోహరమైన మార్గమున సంభాషణ నడుపుట అని అర్థము.

దీనికీ కాస్త నేర్పరితనం కావలయును. అయిదు నిమిషాల సేపు మనోహరంగా మాట్లాడడము కూడా అంత సులభమైన పని కాదు.

రైలులో ఎక్కి కూర్చున్న మనిషితో ప్లాట్‌ఫారం మీద నిలబడి వున్న మనిషి నాలుగు నిమిషాల సేపు మాట్లాడడము తెలియక ఎంత అవస్థ పడినాడో ఈ క్రింది సంభాషణ చూస్తే తెలుసుంది.

"అయితే నీవు యకాయకీని నెల్లూరు వెడతా వన్న మాటేగా? ఒంగోలులో దిగవుగాదూ? సరే, ఏం జేసాం చెప్పు."

"వెళ్ళడంతోనే ఉత్తరం రాస్తావు కదూ!"

"ఒంగోలులో దిగవన్న మాటేనా?"

"సరే ఈ మధ్య ఎక్కడైనా కాస్త ఫలహారం చెయ్యి."

"ఈ బండి నెల్లూరు వెళ్ళేసరికి మధ్యాహ్నం రెండు గంట లవుతుంది. కాబట్టి ఎక్కడైనా కాస్త ఫలహారం చెయ్యి."

"పోనీ ఒంగోలులో భోజనమే చేస్తే తీరిపోతుంది గా అట్లా చెయ్యి."

"ఒంగోలులో దిగవన్నమాట. సరే."

"నెల్లూరులో రైలు చాలాసేపు ఆగుతుందిలే. తొందర పడనక్కర్లేదు. నింపాదిగా దిగవచ్చు."

"సరే. ఉంటా. ఇంతకూ ఒంగోలులో దిగకుండానే యకాయకీని నెల్లూరు వెళ్ళి పోతా వన్న మాట!"

ఇదీ వరుస. సంభాషణ సాగించే తెలివి తేటలు లేకపోతే మాటల దొరణి ఇల్లాగే కుంటి నడకలు నడుస్తుంది. ప్రసంగ కుశలుడు కాకపోతే ఇంతే.

సంభాషణలో కూడా రచనలో వలెనే సుశబ్ద ప్రయోగము చేయడము నేర్చి ఉండాలి. మనిషి పండితుడు అయిందీ, పామరుడు అయిందీ, సంస్కారము కలవాడు అయిందీ, సంస్కార హీనుడు అయినదీ తెలిసేది ఈ పద ప్రయోగమే.

విద్యార్థులు ముఖ్యంగా గమనించవలసిన విషయము ఇది. పామరుల వ్యవహారములో మాత్రము ప్రసిద్ధమయిన అర్థముగల శబ్దములనూ సభ్యత సంస్కారము పొందినీ శబ్దములనూ వాడుట వలన సంభాషణకు అపకర్ష వస్తుంది.

నేటి విద్యార్థుల సంభాషణలలో ఆశ్లీల పద ప్రయోగము బహుళంగా ఉన్నది. వారు అమంగళకరమూ, వ్రీడాకరము, జుగుప్సా ప్రతీతికరమూ అయిన శబ్దాలను తరుచుగా వాడి వినేవాడికి ఏవగింపులు కలుగ జేస్తున్నారు.

అల్లాగ బూతులు మాట్లాడడము వలన సంభాషణకు స్థిరత్వమూ, గట్టితనమూ వస్తుందని వారు అనుకొంటారు.

ఎవరి ముందో తమకు గల తిరస్కార భావాన్ని వెల్లడించడానికి, క్రోధమూ, కోపమూ, రోషమూ మొదలైన మనో వికారాలను ప్రదర్శించేటప్పుడూ, తమ శక్తి సామర్థ్యాలనూ, పౌరుషమునూ, ప్రతిపత్తినీ, ధైర్యశౌర్యాది గుణములూ ఇతరులు గ్రహించవలయునని కోరిక కలిగినపుడూ ఇల్లాంటి హీన శబ్దములను ప్రయోగించి మన జాతికే అపకీర్తిని తెస్తున్నారు.

ఆంధ్రజాతి అశ్లీల ప్రయోగాలను, అమంగళకరమైన శబ్ద ప్రయోగమును సహించదు. మనము బియ్యం అయిపోయినవి అంటే అమంగళ ప్రతీతి కలుగుతుందని, నిండుకున్నవి అంటాము. దీపం పెద్దదైనది అంటాము. లేక కొండెక్కింది అంటాము. అమంగళవారాన్ని మంగళ వారము అంటాము. అటువంటి సంస్కృతి సంప్రదాయమూ గల జాతికి చెందిన వారు. సంభాషణలో, బూతులు వాడడము ఎంత శోచనీయమో తెలిసికోలేకుండా ఉన్నారు విద్యార్థులు.

ఇక లోకాభి రామాయణం సంగతికి వద్దాము.

ఈ లోకాభి రామాయణము అనేది ఒక దారిని నడవదు. ఒక విషయాన్ని అంటి పెట్టుకొని ఉండదు. అది వక్రగామి. కప్పగంతులు వేస్తుంది. అదే దాని స్వభావము.

అయినప్పటికీ అందులో చిత్ర విచిత్రమైన పోకడలు పోవచ్చును. వినేవాడి మనస్సును రంజింపజేయవచ్చును.

మధుర భాషణతోనే సరస్వతి చరణ మంజీర రవములు సహృదయ హృదయములను స్పందింపజేయగల ఈ రకము సంభాషణ అవతలి వానిని మనక్కు సుముఖులుగా చేయగల సామర్థ్యమును కలిగి ఉంటుంది. మనలో ఉన్న మంచిని ఇతరులు గ్రహించటానికి తోడ్పడుతుంది.

ఒకనిలో ఉండే సుగుణ సంపత్తి, విద్యా సంపత్తి, వినయము, ప్రియ భాషిత్వము, మృదుత్వము, మాధుర్యము ఇవన్నీ కూడా ఇల్లాంటి ఇష్ట గోష్ఠిలోనే బహిర్గతము అవుతూ ఉంటవి.

కాబట్టి మనము ఎవరి దగ్గరకైనా కొత్త కబుర్లు చెప్పుకొంటానికి వెళ్ళినప్పుడు ఇష్టం వచ్చిన విషయమును గూర్చి మాట్లాడవచ్చును గాని, ఇష్టం వచ్చిన రీతిని మాట్లాడకూడదు. ఈ విషయంలో ఔచిత్యం పాటించకపోతే మనమే హాస్యాస్పదులము అవుతాము.

లోకాభి రామాయణం మాట్లాడుకొంటానికి ఇద్దరు వ్యక్తులు చేరినప్పుడు అక్కడ సంభాషణ యొక్క ప్రధానోద్దేశము కులాసాగా కాలం పుచ్చడం కాబట్టి, ఆ చేరిన ఇద్దరు వ్యక్తులూ కూడా ఒకరి నొకరు సంతోష పెట్టడానికి ప్రయత్నం చెయ్యవలెను.

అట్టి సమయాలలో ఇరువురు తమ తమ కష్ట సుఖాలు చెప్పుకుంటూ ఉన్నప్పుడు ఒకరి యెడల ఒకరికి సానుభూతి ఉండవలె. ఒకరు చెప్పే విషయాన్ని మరొకరు సావధానంగా వినే ఓర్పు ఉండవలె.

అసలు ప్రసంగ కౌశల్యము అంటే విస్తారము మాట్లాడడము కానే కాదు. ఎదుటి వ్యక్తి చెప్పేది మౌనముతోనూ, ఓపికతోనూ వినడమూ, మధ్య మధ్య సానుభూతి సూచకంగా ఒక నిట్టూర్పు విడవడమూ లేక ఉచిత రీతిని శిరఃకంపనము చేసి, చిరునవ్వు నవ్వి, అతడు చెప్పిన విషయమునకు తన సమ్మతిని తెలియజేయడమూ ప్రసంగ కుశలతకు లక్షణాలుగా గ్రహించవలయును.

సంభాషణ జరిగేటప్పుడు మాట్లాడే వ్యక్తి తనను గురించి చెప్పుకొంటే స్వోత్కర్ష అవుతుంది. ఎవరో వ్యక్తిని గురించి మాట్లాడితే చాగుడు అవుతుంది. తన మాటలు వింటూ ఉన్న వ్యక్తిని గురించి ప్రశంసా వాక్యాలు పలికితే అది ప్రసంగ వైదుష్యము అవుతుంది.

(మిగతా 68 వ పేజీలో)

# లోకాభి రామాయణం

(60 వ పేజీ తరువాయి)

సంభాషణ జరుగుతూ ఉంటే ఒకరు మాట్లాడుతూ ఉన్నప్పుడు రెండవ వారు జాగ్రత్తగా వినడమూ, మాటకు అడ్డము రాకుండా ఉండడమూ సంభాషణా నైపుణి యొక్క ప్రధాన లక్షణాలు.

సంభాషణ సాధారణంగా "ఏం కులాసాగా ఉన్నారా?" అనే వాక్యంతో ప్రారంభం అవుతుంది.

అల్లా ప్రారంభం కావడముతో ఒకరు "కులాసాగానే ఉన్నాను గాని జీర్ణ శక్తి సరిగా లేదండి. తిన్న అన్నం సరిగ్గా అరగదు" అంటాడు రెండవవారి సానుభూతిని కోరుతూ.

వెంటనే ఈ రెండవ పెద్ద మనిషి తన జీర్ణ శక్తి ఎల్లాంటిది అయిందీ చెప్తూ, తాను ఆరోగ్య సూత్రాలన్నీ పాటిస్తూ ఉన్నట్లు గొప్పలు చెప్పి మనము అలా జీవించక పోవడము మూలాన్నే ఈ విధంగా ఆరోగ్యం పోగొట్టుకొన్నామని సూచించి మనలను చిన్న పుచ్చి తన గొప్పను స్థాపించను కోరుతాడు. ఇదే సంభాషణలో చేయు మొదటి పని. లోకాభి రామాయణం అనబడే సంభాషణ ఒక విషయాన్నుంచి మరొక విషయానికి జరిగి పోవడము చూస్తే, చాలా తమాషాగా ఉంటుంది. ఇద్దరు స్నేహితులు చేరుతారు. కొరియా యుద్ధంతో సంభాషణ ప్రారంభం అవుతుంది. వెంటనే అది మూడవ ప్రపంచ యుద్ధంగా మారే అవకాశాన్ని గురించి తీవ్రమైన చర్చ జరుగుతుంది. ప్రాసంగికంగా అమెరికా ఇండియాకు చేస్తున్న సహాయం సంగతి వస్తుంది. ఇంతలో ఆంధ్ర రాష్ట్రము సంగతి, దాని మీద రాజధాని ఎక్కడ ఉండవలయు ననెడి చర్చ, బెజవాడలో విపరీతమైన ఎండలు అందువలన మనుష్యులు మాడి పోతున్నారు కాబట్టి బందరు అన్ని విధాల అనుకూలమైన ప్రదేశము అని తీవ్ర వాదన జరుగుతుంది. ఇల్లాగ సంభాషణ గంతులేస్తూ సాగిపోతుంది.

నలుగురు ఆడవాళ్ళు చేరినప్పుడు ఇల్లాంటి ఇష్టాగోష్ఠి వివిధ విషయాలపై పరుగెత్తి విచిత్రంగా ఉంటుంది.

మా యింట్లో బంగాళా దుంపల కూర చేసుకున్నామని ఒకావిడ సంభాషణ ప్రారంభం చేస్తుంది.

పక్క ఆవిడ తాను రెండు కూరలు చేసినట్లు ఆ సభలో తెలియ జేస్తుంది ఎంతో గర్వంతో. "రెండు కూరలు ఎందుకమ్మా మరీ విడ్డూరం కాకపోతే!" అని ఒక విసుర్లు. ఆ తరువాత ఆ విషయమై కాసేపు చర్చ జరిగి మూతి ముడుపులతో అంతము కావడము జరుగుతుంది.

ఆంధ్రరాష్ట్రం వస్తే, వంకాయలు, పట్టు చీరలు, నవరసలు చవుక అవుతాయని ఒక వార్తను ప్రకటిస్తుంది ఒకావిడ.

"ఆంధ్రరాష్ట్రం వచ్చిన తరువాత ఒక గంట సేపు మాత్రమునవరసలు చవుకగా అమ్మిస్తారుటమ్మా" అని మరొక ఆవిడ చిన్న సవరణను ప్రతిపాదిస్తుంది.

ఆ తరువాత ఎలక్ట్రిక్ దీపాలు విడుస్తూ ఉండటానికి కారణము ఏమిటో అని ప్రశ్న వస్తుంది. మండి పోతూ వున్న ఎండల వల్లనే దీపాలలో ఉండే కాంతి హరించుకు పోతున్నదని ఒక ముసలమ్మ చెప్పడమూ, అందరూ నిజమే ఆ మాట అనుకోవడమూ జరిగి పోతుంది.

చివరకు మగవాళ్ళు ఇంటి విషయమై పట్టించుకోకుండా తిరగడము అనే విషయము చర్చకు వస్తుంది. ఈ విషయంలో ఒక్కొక్కరు తమ అనుభవాలనూ తాము పడుతున్న కష్టాలనూ గురించి చెపుతారు.

ఒకరి మాటలు ఒకరు వినిపించుకోరు. ఎవరి మాటలు వాళ్ళే వినిపించుకొంటారు. ఈ విషయమై పెద్ద పెట్టున చర్చ జరిగిన తరువాత ఒకరి అనుభవాలు ఒకరు వినక పోయినా మొత్తంమీద అందరూ ఏకగ్రీవంగా అంగీకరిస్తారు. ఈ మగళ్ళ సంగతి ఏమీ బాగుండలేదని, తాము కాంగా కాపురం చేస్తున్నారు కాని ఇంకొకరు అయితే కాపురాలు ముక్కచెక్కలు అయిపోయేవని అని అంతా అంగీకరిస్తారు. ఇల్లాగ ఉంటుంది వారి సంభాషణ.

పిల్లలు కూడా ఇల్లాగే తమకు అందకలో ఉన్న విషయాలను గురించి మాట్లాడుకొంటారు.

ఇల్లాగ కులాసాగా కబుర్లు చెప్పుకోవడం వలన ప్రయోజనం లేకపోలేదు. గంభీర ప్రసంగములతోనే జీవితం అంతా గడపలేము. ఇష్టము వచ్చినట్లు ఏ నిర్బంధమూ లేకుండా మాట్లాడుకోవడం వలన్నా మనస్సును స్వేచ్ఛగా సంచరించ నీయడము వలనా ఆనందము కలుగుతుంది. మనస్సుకు విశ్రాంతి కలుగుతుంది. ఎదుటివారి మనస్సుకు కష్టం కలుగకుండా మాట్లాడే నేర్పు కుదురుతుంది. శబ్ద లాలిత్యం అలవడుతుంది. లలిత పదములతో కూడిన అభిభాషణ వలన సభ్యత, నాగరికత అలవడుతవి.

ఇల్లాంటి సంభాషణల వలన మాట పొందిక కుదురుతుంది. సంభాషణలో ఉండే పలుకుబడి, పలుకుబడిలో ఉండే ఒడుపు, వాక్యంలో ఉండే పద వ్యుత్పత్తి మనకు తెలుస్తవి.

మంచి బట్టలు వేసుకొనడము వలన బాహ్య సౌందర్యం వచ్చినట్లు, మంచి సంభాషణల వలన అంతర రామణీయకతనూ పెంపొందించవచ్చు.

అయితే ఈ రకంగా జరిగే సంభాషణ ఎప్పుడూ పరిమితంగా ఉండవలె. గట్టు తెగి ప్రవహించే నది వలె సంభాషణ సాగ కూడదు. ఏదో కొంత పరిమితిలో నడిస్తేనే ఈ సంభాషణ రాణిస్తుంది.

సంభాషణా సామర్థ్యము అందరికీ ఉండదు. అతిగా మాట్లాడడము సాగిస్తే, ఏదో ఒక సమయంలో అప్రమత్తులమై అవాచ్యాన్ని పలుకడమో, అవ్యక్తమును వ్యక్తము చేయడమో జరిగి సంభాషణ పేలవమై పోతుంది.

పేలవము అయిపోతే కొంత నయమే. అల్లా కాక మనము అనాలోచితంగా అన్న ఏ మాటో అవతలి వాళ్ళకు తగిలి మనస్పర్థలకు కారణము అవుతుంది.

మర్యాదను అతిక్రమించకుండా, మోతాదును మించకుండా కొంచెం సేపు కబుర్లు చెప్పుకొంటే కాసేపు చల్లగాలిలో తిరిగినప్పుడు కలిగే హాయి కలుగుతుంది.

